# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988
vntelugudaily@gmail.com




సంపుటి : 3 సంచిక : 305 శనివారం 21 మార్చి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం

- ఎన్నికల వేళ రాహుల్ గాంధీ
- త్వరలో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు
- రాష్ట్ర ప్రజలనుద్దేశించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పోస్ట్
- అధికార మార్పునకు కేరళ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యలు



## ఆన్‌లైన్ జూదానికి చెక్...

- మరో 300 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం వేటు
- 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు
- బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు



# సంక్షేమానికి పెద్దపీట

మొత్తం రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర పద్దు

తెలంగాణ శాసనసభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



- మూలధన వ్యయం - రూ.47,267 కోట్లు
- మొత్తం రెవెన్యూ ఆదాయం - రూ.2,41,263 కోట్లు
- రాష్ట్ర పన్ను ఆదాయం - రూ.1,48,185 కోట్లు
- పన్నేతర ఆదాయం - రూ.35,730 కోట్లు
- గ్రాంట్లు - రూ.24,166 కోట్లు
- మొత్తం మూలధన ఆదాయం - రూ.82,870 కోట్లు

### కొత్తగా 2లక్షల మందికి పింఛన్లు, 5లక్షల బీమా

కొత్త పథకాలను ప్రస్తావించిన ఆర్థిక మంత్రి

అర్హులైన 2 లక్షల మంది నూతన పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటన





## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత...

- లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు
- ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది.
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది
- ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది

## ఆందోళనతో ఎల్‌పీజీ బుకింగ్స్ చేసుకోవడం తగ్గిపోయింది



- దేశవ్యాప్తంగా సరిపడా స్టాక్ : కేంద్రం
- గురువారం కేవలం 55 లక్షల ఎల్‌పీజీ సిలిండర్ల బుకింగ్
- ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరల పెంపు ఎల్‌పీజీ ఉత్పత్తిని 40 శాతానికిపైగా పెంచాం
- కేంద్రం కీలక వ్యాఖ్యలు

## నర్సరీ నుంచి ఇంటర్ వరకూ
# ఒకే విద్యా విధానం!

- కమిషన్ నివేదికే ఫైనల్ కాదు
- విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నాం
- ఇవాళ ప్రవేశపెట్టిన పద్దు, ఫ్యూచరిస్టిక్ బడ్జెట్
- అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు
- చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్**

ఇవాళ ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్తుకే మైలురాయి వంటిదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని తెలిపారు. జూన్ నుంచి ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా ద్వారా రూ.5 లక్షల పరిహారం ఇస్తామన్నారు. విద్యారంగ సంస్కరణల కు, ప్రజారోగ్య సంరక్షణకు అధిక నిధులు కేటాయించా మన్నారు. విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ముచ్చటించారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుంటాయని చెప్పారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకేచోట చదివేలా విద్యావిధా నం ఉంటుందన్నారు. విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నామని, వాటిపై కమిటీ అధ్యయనం చేస్తోందని తెలిపారు. విద్యావ్యవస్థలో మార్పులపై కమిషన్ నివేదికే ఫైనల్ కాదని చెప్పారు. జాతీయస్థాయి అధ్యయనం - మిగతా3లో

# తెలంగాణ మరో శ్రీలంక కాబోతోంది

- బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్
- చిప్ప చేతికిచ్చే పాలన కాంగ్రెస్‌ది. మనది బిచ్చపు బతుకులేనా.?
- ఇది ప్రజలను వంచించే బడ్జెట్.
- అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగేదేమీ లేదు



**కరీంనగర్**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ పెదవి విరిచారు. తెలంగాణ మరో శ్రీలంక కాబోతోందంటూ విమర్శించారు బండి సంజయ్. ' చిప్ప చేతికిచ్చే పాలన కాంగ్రెస్‌ది. మనది బిచ్చపు బతుకులేనా...?, ఇప్పుడు తెలంగాణా సమాజం ఆలోచించాల్సిన సమయం.. ఇది ప్రజలను వంచించే బడ్జెట్. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగేదేమీ లేదు. రైతుభరోసా విషయంలో - మిగతా3లో



## బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు

- టీఎంసీ మేనిఫెస్టోను విడుదల చేసిన మమతా బెనర్జీ
- బంగాల్ ఎన్నికలు 2026 - టీఎంసీ మేనిఫెస్టోలోని 10 హామీలివే!

## ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి
- ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో 'బలవంతుడిదే రాజ్యం' అనే నీతి నడుస్తోంది



# ‘బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు’



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మేనిఫెస్టోను సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. ‘బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు’ శీర్షికన ఈ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను రూపొందించారు. ఈసందర్భంగా శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మేనిఫెస్టో ప్రజా కేంద్రకంగా ఉంటుందని ప్రకటించారు. బంగాల్‌లోకి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని అడ్డుకోవడం, బంగాల్ ఉనికిని కాపాడటం తమ పార్టీ లక్ష్యాలని ఆమె వెల్లడించారు. బంగాల్ ఎన్నికల తర్వాత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్‌ఆర్‌సీ), జన గణన పేర్లతో ప్రజల పౌరసత్వాలను లాక్కునే యత్నాన్ని కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దీదీ ఆరోపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఆమె కోరారు.

**టీఎంసీ మేనిఫెస్టోలోని 10 హామీలివే!**

లక్ష్మీర్ భండార్ స్కీం ద్వారా మహిళలకు ప్రతినెలా అందించే ఆర్థిక సహాయం మరో రూ.500 పెంపు. ఈ ఎన్నికల్లో టీఎంసీ గెలిస్తే, లక్ష్మీర్ భండార్ స్కీం ద్వారా జనరల్ కేటగిరీ మహిళలకు ప్రతినెలా రూ.1,500, ఎస్సీ,ఎస్టీ మహిళలకు ప్రతినెలా రూ.1,700 సాయం.

నిరుద్యోగ యువతకు బంగ్లార్ యుబ సాథీ స్కీం ద్వారా ప్రతినెలా రూ.1,500 భత్యాన్ని అందించడాన్ని కొనసాగిస్తారు.

రైతులు, కౌలు రైతులకు చేయూతను అందించడానికి రూ.30వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్

ప్రతీ కుటుంబానికి పక్కా ఇళ్ల నిర్మాణం

అన్ని ఇళ్లకు పైప్‌లైన్ల ద్వారా రక్షిత మంచినీటి సరఫరా

ఆరోగ్య సంరక్షణ సేవలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా దువారే చికిత్సా క్యాంపుల నిర్వహణ

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన

తూర్పు భారతదేశంలో ట్రేడ్ హబ్‌గా బంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం, ఇందుకోసం ఆధునిక రవాణా వసతుల కల్పన, గ్లోబల్ ట్రేడ్ సెంటర్ నిర్మాణం.

వృద్ధాప్య పెన్షన్లను ఇవ్వడాన్ని కొనసాగిస్తూనే, వాటిని మరింత మందికి మంజూరు చేయడం.

బంగాల్ రాష్ట్రంలో ఏడు కొత్త జిల్లాల ఏర్పాటు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో విస్తరణ చేయడం.

సంతోషపు వెలుగులు ప్రతీ ఇంటికి చేరాలి!

“నేను బంగాల్ ప్రజలకు 10 హామీలను ఇస్తున్నాను. తప్పకుండా వీటిని రాబోయే ఐదేళ్ల పాటు అమలు చేస్తాను. రాష్ట్రంలోని గడపగడపకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను చేరుస్తాను. ఇందుకోసం ప్రతీ బ్లాక్ పరిధిలో దువారే చికిత్సా క్యాంపులను ఏర్పాటు చేస్తాం. బంగాల్ రాష్ట్ర అభివృద్ధి చక్రాలు ఎలాంటి అంతరాయం లేకుండా తిరిగేందుకు దోహదం చేసేలా మా మేనిఫెస్టోను రూపొందించాం. సంతోషపు వెలుగులు బంగాల్‌లోని ప్రతీ ఇంటికి చేరాలి అనేది మా లక్ష్యం” అని ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో సీఎం మమతా బెనర్జీ తెలిపారు.

**బంగాల్‌లో అనధికారిక రాష్ట్రపతి పాలన**

“ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బదిలీ ప్రక్రియను ఈసీ చేస్తోంది. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోకి డబ్బు, ఆయుధాలను తరలించేందుకు, బీజేపీ సూచనల మేరకు అధికారులను ఈసీ బదిలీ చేస్తోంది. ఈసీ చర్యలన్నీ చూస్తుంటే, బంగాల్‌లో అనధికారిక రాష్ట్రపతి పాలనను అమలు చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఈసీ, కేంద్ర ప్రభుత్వం కలిసి ఈ పరిస్థితిని సృష్టించాయి. ఎన్నికల్లో ఓటమి తప్పదనే విషయాన్ని గ్రహించబట్టే బీజేపీ ఇవన్నీ చేయిస్తోంది. ఇలా చేయడం సిగ్గుచేటు. అధికారుల బదిలీలకు ఒక పరిమితి అనేది ఉంటుంది. కానీ ఈసారి అన్ని శాఖల ఆఫీసర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇలాంటప్పుడు ఒకవేళ ప్రజలకు రేషన్ సరుకులు అందకుంటే, వాళ్లు ఎవరి దగ్గరకు వెళ్లాలి? ఇప్పుడు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన వాళ్లకు ఈ రాష్ట్రం కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు కానీ తెలియవు” అని సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు.

**10 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితాల నుంచి తొలగింపు**

“ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రత్యేకించి ఒక నిర్దిష్ట సామాజిక వర్గం ప్రజలను వివక్షాపూరితంగా టార్గెట్ చేస్తున్నారు. దాదాపు 60 లక్షల మంది ఎస్ఐఆర్ దరఖాస్తులపై విచారణ జరపగా, 22 లక్షల దరఖాస్తులనే ఆమోదించారని నేను విన్నాను. ఇంచుమించు 10 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించారట. ఈ గణాంకాలను క్రాస్ చెక్ చేయాల్సి ఉంది” అని సీఎం మమతా బెనర్జీ చెప్పారు.

**బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ‘పునర్విభజన’**

“వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా, రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కుట్రపన్నాయి. ఈ ఎన్నికల తర్వాతే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియ జరిగితే రాజకీయ ప్రాతినిధ్య గణాంకాలు మారిపోతాయి. వచ్చే ఎన్నికల్లో బీజేపీని కేంద్రంలో అధికారంలోకి రానివ్వం. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చడం, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనాలను చేకూర్చడాన్నే బీజేపీ పనిగా పెట్టుకుంది. రైల్వేలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే ప్రక్రియను మొదలుపెట్టింది. భారతదేశాన్ని లూటీ చేసి విదేశాలకు పారిపోయిన వాళ్లకూ ప్రభుత్వరంగ సంస్థలను అప్పగించే యత్నాలు జరుగుతున్నాయి. బీజేపీ రాజకీయ టార్గెట్‌లో బంగాల్ ఉంది. దేశంలో బలమైన రాష్ట్రంగా బంగాల్ ఉండాలని ఆ పార్టీ కోరుకోవడం లేదు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ఈ ఎన్నికలే సరైన సమయం. ఈ దేశాన్ని మనం మోదీ నుంచి కాపాడాలి. బంగాల్ ప్రజలు తప్పకుండా బీజేపీకి ధీటైన సమాధానాన్ని ఇస్తారు” అని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తెలిపారు.

**సీఎం లెటర్ హెడ్‌ను వాడినందుకు మమతపై చర్యలు తీసుకోవాలి : సువేందు**

రాజకీయ ప్రత్యుత్తరాల కోసం సీఎం లెటర్ హెడ్‌ను వినియోగించడం ద్వారా ఎన్నికల కోడ్‌ను సీఎం మమతా బెనర్జీ ఉల్లంఘించారని విపక్ష నేత (బీజేపీ) సువేందు అధికారి ఆరోపించారు. ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసీని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం పూర్వ మెదినీపూర్ పరిధిలోని మహిసాదళ్ పట్టణంలో విలేకరుల సమావేశంలో సువేందు అధికారి మాట్లాడారు. గురువారం రోజు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు సీఎం లెటర్ హెడ్‌తో మమతా బెనర్జీ రాసిన లేఖపై ఆయన మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రభుత్వ పాలనాపరమైన విధులు, పార్టీ రాజకీయాలను ఏకకాలంలో వినియోగించడం కుదరదన్నారు. సీఎం లెటర్ హెడ్‌ను కూడా వినియోగించకూడదని సువేందు అధికారి తెలిపారు. కావాలంటే టీఎంసీ పార్టీ లెటర్ హెడ్‌పై మమతా బెనర్జీ ఏదైనా, ఎంతైనా రాసుకోవచ్చని సూచించారు.

**ఈసీకి సువేందు ప్రశ్నలు**

రాష్ట్రంలోని బహిరంగ ప్రదేశాల్లో మమతా బెనర్జీ ఫొటోలతో ఉన్న ప్రభుత్వ హోర్డింగ్‌లు, ఫొటోగ్రాఫ్‌లు, బిల్ బోర్డ్‌లను తొలగించాలని ఎన్నికల సంఘాన్ని సువేందు అధికారి కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా, చాలాచోట్ల అవి అలాగే ఉన్నాయన్నారు. ఇంకా వాటిని ఎందుకు తొలగించలేదని, ఏ భయంతో మమతా బెనర్జీకి ఈసీ ఈ అవకాశాలన్నీ ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. టీఎంసీ అభ్యర్థుల జాబితాలో రేప్ అభియోగాలు ఉన్నవారు, ఏళ్లతరబడి జైలుకు వెళ్లొచ్చిన వారి పేర్లు ఉన్నాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇలాంటి అభ్యర్థుల జాబితాను ఏ పార్టీ కూడా విడుదల చేయలేదని సువేందు విమర్శించారు. అభ్యర్థుల ఎంపికపై టీఎంసీలో అంతర్గత అసమ్మతి ఉందన్నారు. బీజేపీ అభ్యర్థుల్లో 50 శాతం మంది క్షేత్రస్థాయి కార్యకర్తలే అని ఆయన తెలిపారు.

# ఆందోళనతో ఎల్‌పీజీ బుకింగ్స్ చేసుకోవడం తగ్గిపోయింది



ప్రజలు ఆందోళనతో ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవడం తగ్గిపోయిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ వెల్లడించింది. గురువారం రోజు కేవలం 55 లక్షల ఎల్‌పీజీ సిలిండర్లనే బుక్ చేసుకున్నారని తెలిపింది. శుక్రవారం కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త విలేకరుల సమావేశంలో ఈవివరాలను పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ చెప్పారు. దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్ల సప్లైలో ఎలాంటి కొరతా లేదని ఆమె తేల్చి చెప్పారు. భారతదేశ అవసరాలకు సరిపడా ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని, ఏ ఒక్క వంటగ్యాస్ సప్లై ఏజెన్సీలోనూ స్టాక్ అయిపోవడం అనేది జరగలేదన్నారు. అయితే ఇప్పటికీ ఎల్‌పీజీ అంశం కొంత ఆందోళనకరంగానే ఉందని సుజాత శర్మ పేర్కొన్నారు.

**గతవారం 11,300 టన్నుల కమర్షియల్ సిలిండర్ల సప్లై**

“పశ్చిమాసియా యుద్ధం మొదలు కావడానికి ముందు దేశంలో రోజూ సగటున 50 లక్షల నుంచి 55 లక్షల ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్లు బుక్ అయ్యేవి. వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ప్రజలు మార్చి 13న ఏకంగా 87.7 లక్షల సిలిండర్లను బుక్ చేసుకున్నారు. కానీ ఈవిధమైన ప్యానిక్ బుకింగ్ తగ్గిపోయి, గురువారం నాటికి 55 లక్షలకు చేరింది. గత రెండువారాల వ్యవధిలో దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ ఉత్పత్తిని 40 శాతానికిపైగా పెంచాం. పశ్చిమాసియా యుద్ధం మొదలైన తొలినాళ్లలో వాణిజ్య సిలిండర్ల సప్లైను కొన్నిరోజులు ఆపాం. కానీ ఆ తర్వాత వాణిజ్య సిలిండర్ల కస్టమర్ల గ్యాస్ అవసరాలను ఐదోవంతు మేర తీర్చడం మొదలుపెట్టాం. గతవారం రోజుల వ్యవధిలో వాణిజ్య సిలిండర్ల కస్టమర్లకు 11,300 టన్నుల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్లను సప్లై చేశాం. ఈనేపథ్యంలో దేశంలోని 15 ప్రాంతాల్లో 13,700 మంది కొత్తగా పీఎన్‌జీ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారు. మరో 7వేల మంది వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కస్టమర్లు కూడా పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లకు మారిపోయారు” అని సుజాత శర్మ వెల్లడించారు.

**ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరల పెంపు**

“ఎల్‌పీజీ సిలిండర్ల కొనుగోలుకు డోర్ డెలివరీ సిస్టమ్ లాంటి సరైన మార్గాలనే కస్టమర్లు అనుసరించాలి. ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరలు మాత్రమే పెరిగాయి. ఈమేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయాన్ని తీసుకున్నాయి. సాధారణ పెట్రోలు, డీజిల్ ధరలు మారలేదు” అని సుజాత శర్మ స్పష్టం చేశారు.

**ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు**

“ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్‌ను వినియోగించే కస్టమర్ల వైఖరిలో చాలా మార్పు వచ్చింది. 7.5 లక్షల మంది ఎల్‌పీజీ యూజర్లు పీఎన్‌జీ పైప్డ్ గ్యాస్‌కు మారిపోయారు. ఇంధన సప్లైలను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా పర్యవేక్షణా యంత్రాంగాలను బలోపేతం చేశాం. 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కంట్రోల్ రూంలు, జిల్లా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంధన సరఫరాలో అవకతవకలను అడ్డుకునేందుకు కఠినమైన చర్యలను తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు నిర్వహించారు. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 1100 రైడ్స్ చేశారు. దేశంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) 1800 ఆకస్మిక తనిఖీలను నిర్వహించాయి” అని పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ తెలిపారు.

**చమురు, ఎల్‌పీజీ సప్లైలకు ఆ మినహాయింపు**

ఎల్‌పీజీ వంటగ్యాస్, ముడి చమురు సప్లైలకు ఊరటనిచ్చే చర్యలను చేపడుతున్నట్లు కేంద్ర నౌకాయాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఇందులో భాగంగా ముడి చమురు, ఎల్‌పీజీ సప్లైలకు మార్చి 14 నుంచి 31 వరకు గ్రౌండ్ ఛార్జీలు, రీఫర్ ఛార్జీల నుంచి మినహాయింపును కల్పిస్తూ న్యూ మంగళూర్ పోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.

**గల్ఫ్‌లో ఆరుగురు భారతీయుల మృతి : విదేశాంగ శాఖ**

పశ్చిమాసియా యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల్లో ఇప్పటివరకు ఆరుగురు భారతీయులు చనిపోగా, ఒకరి ఆచూకీ గల్లంతైందని విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి (గల్ఫ్) అసీమ్ ఆర్ మహాజన్ శుక్రవారం వెల్లడించారు. చనిపోయిన భారతీయుల భౌతిక కాయాలను వీలైనంత త్వరగా దేశానికి తీసుకొచ్చేందుకు, ఆయా దేశాల అధికార వర్గాలతో అక్కడి భారత ఎంబసీలు సమన్వయం చేసుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆచూకీ గల్లంతైన భారతీయుడిని గుర్తించే దిశగానూ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సౌదీ అరేబియా, ఒమన్, ఇరాక్, యూఏఈలలోని భారత ఎంబసీలు ఈ అంశాలపై పూర్తి ఫోకస్ పెట్టాయని అసీమ్ ఆర్ మహాజన్ చెప్పారు.

**3 లక్షల మంది భారతీయులు తిరిగొచ్చేశారు**

గల్ఫ్ దేశాల నుంచి విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయని, పెద్దసంఖ్యలో భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి వస్తున్నారన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా సైనిక ఘర్షణ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 3 లక్షల మంది భారతీయులు గల్ఫ్ దేశాల నుంచి వచ్చేశారని ఆయన పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ యూఏఈ నుంచి భద్రతా పరిస్థితుల ప్రాతిపదికన పరిమిత స్థాయిలోనే నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను నడుపుతున్నారని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. శుక్రవారం రోజు దాదాపు 90 విమానాలు యూఏఈలోని వివిధ ఎయిర్‌పోర్టుల నుంచి భారత్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇక ఒమన్, సౌదీ అరేబియాల నుంచి భారత్‌కు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయని, ఖతర్ గగనతలం పాక్షికంగా తెరుచుకుందని పేర్కొన్నారు. శుక్రవారం రోజు భారత్‌కు 10 నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను ఖతర్ ఎయిర్‌వేస్ నడిపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

**తెరుచుకోని కువైట్, బహ్రెయిన్ గగనతలాలు**

ఇప్పటికీ కువైట్, బహ్రెయిన్ గగనతలాలు మూసివేసి ఉన్నాయన్నారు. కువైట్ ఎయిర్ వేస్ సౌదీ అరేబియాలోని అల్ ఖైసుమా హఫర్ అల్ బాతిన్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌లోని కొచ్చికి శుక్రవారం తొలి విమాన సర్వీసును నడిపే అవకాశం ఉందని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. బహ్రెయిన్‌కు చెందిన గల్ఫ్ ఎయిర్ సైతం సౌదీ అరేబియాలోని దమ్మమ్‌లో ఉన్న కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌కు విమాన సర్వీసులను కొనసాగిస్తుందన్నారు.

## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత...




అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం

మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. “యూడీఎఫ్ కూటమి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి కేరళం ప్రజల గొంతుకను, ఆకాంక్షలను, నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నారు. ఈ కూటమి అనుభవజ్ఞులైన నాయకులు, మార్పు తేవాలనే యువకుల కలయిక. నాకు కేరళం ఇల్లు. కేరళ ప్రజలు కుటుంబ సభ్యులు. కేరళ ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు వారికి నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను ఎల్లప్పుడూ ప్రజల భాగస్వామిగా ఉంటాను. కేరళం నుంచి వస్తున్న సందేశం స్పష్టం. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ప్రజల మాట వినే, వారిని అర్థం చేసుకునే, నిజాయితీతో పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. రాబోయే యూడీఎఫ్ ప్రభుత్వంతో కలిసి ఈ అందమైన రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించడానికి నేను చేయగలిగినదంతా చేస్తాను. కేరళం గెలుస్తుంది- అందుకు యూడీఎఫ్ నాయకత్వం వహిస్తుంది.”

**ఇక నుంచి ఆ విధానం పనిచేయదు : శశిథరూర్**

కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విదేశాల నుంచి వచ్చే నగదు, లాటరీలు, మద్యంపై ఆధారపడేలా చేస్తోందని శశిథరూర్ ఆరోపించారు. ఇక నుంచి ఈ విధానం పనిచేయదని మండిపడ్డారు. కేరళలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రణాళిక, ఎల్‌డీఎఫ్ పదేళ్ల పాలనపై ఉన్న వ్యతిరేకత కంటే చాలా సానుకూలంగా ఉందని తెలిపారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తోందని శశిథరూర్ విమర్శించారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ నాటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు అయిపోతున్నాయని, ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం అప్పు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్ ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజలకు చూపించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమా అని అడగ్గా, థరూర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. తమ పార్టీ ధ్యేయం చాలా సానుకూలమైనదని భావిస్తున్నానని తెలిపారు. అది కేరళ 2.0కి సంబంధించినదని వివరించారు. “యూడీఎఫ్ పార్టీ మేనిఫెస్టో ఇంకా వెలువడలేదు. అయితే రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలనేది తాను ప్రతిపాదిస్తున్న ఐడియాల్లో ఒకటి. కేరళ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం చేసిన తప్పులన్నింటికీ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పెన్షన్ వంటి ఐదు నిర్దిష్ట హామీలను ప్రజలకు ఇచ్చాం. విదేశాల నుంచి వచ్చే డబ్బు, లాటరీలు, మద్యం రాష్ట్రాన్ని నడిపిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే ప్రాజెక్టుల కోసం చేసే ఖర్చు కంటే అప్పుల చెల్లింపులు, వాటిపై వడ్డీలు, జీతాలు, పెన్షన్ల కోసమే కేరళ సర్కార్ ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తోంది. దేశంలో అత్యధిక పన్నులు చెల్లిస్తున్నది కేరళ వాసులే. అత్యధిక ఆస్తి పన్ను, అత్యధిక స్టాంప్ డ్యూటీ కడుతున్నారు. నా దగ్గర చాలా ఆలోచనలు ఉన్నాయి. కాంగ్రెస్-యూడీఎఫ్‌ల దగ్గర కూడా ఇంతవరకు ప్రయత్నించని కొత్త విషయాల కోసం చాలా ఐడియాలు ఉన్నాయి. “

**బీజేపీపై కీలక వ్యాఖ్యలు**


త్వరలో కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక నామమాత్రపు పార్టీగానే మిగిలిపోతుందని శశిథరూర్ జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్యనే ఉంటుందన్నారు. “కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉండదు. ఎందుకంటే అసెంబ్లీలో బీజేపీకి ప్రస్తుతం ఉన్న సీట్లు సున్నా. సున్నా నుంచి ఒకటి, రెండు లేదా మూడు సీట్లకు వెళితే వారు (బీజేపీ నేతలు) చాలా గర్వంగా, సంతోషంగా ఉంటారు. గొప్ప విజయం సాధించామని తమను తాము అభినందించుకుంటారు. బీజేపీ ప్రస్తుతం అలాంటి పరిస్థితిలోనే ఉంది” అని శశిథరూర్ పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ జూదానికి చెక్...



ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన ‘ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025’ కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం... పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు ‘ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా’ను కూడా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, యువత వ్యసనాలకు బానిసలు కావడం, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా ‘గేమింగ్ డిజార్డర్’ను ఒక ఆరోగ్య సమస్యగా గుర్తించింది. అయితే, ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, సురక్షితమైన సోషల్, ఎడ్యుకేషనల్ గేమ్‌లను ప్రోత్సహిస్తోంది. లాభాల ఆశ చూపి వినియోగదారులను దోపిడీ చేసే బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లకు, నైపుణ్యాన్ని పెంచే గేమ్‌లకు మధ్య స్పష్టమైన తేడాను ఈ చట్టం చూపిస్తోంది.

## ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు



ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాన్ని ఆపగల సత్తా ఒక్క భారత్‌కే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విదర్భ ప్రాంత కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో ‘బలవంతుడిదే రాజ్యం’ అనే నీతి నడుస్తోందని, ఇది భారతీయ విలువలైన మానవతా ధర్మానికి పూర్తి విరుద్ధమని భగవత్ విమర్శించారు. ధర్మ పునాదులతో ప్రపంచంలో సమతుల్యతను పునరుద్ధరించే బాధ్యత భారత్‌పై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోందని తెలిపారు. గత 2,000 ఏళ్లుగా అనేక సిద్ధాంతాలు ప్రపంచానికి శాశ్వత శాంతిని అందించడంలో విఫలమయ్యాయని, ఎందుకంటే వాటిలో ఐక్యతా భావన లోపించిందని భగవత్ విశ్లేషించారు. స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్య కాంక్షే ఆధునిక ఘర్షణలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పాత్ర పోషించడానికి ముందు దేశం అంతర్గతంగా బలంగా మారాలని భగవత్ పిలుపునిచ్చారు. “సత్యం మన వైపు ఉన్నా, మనం బలహీనంగా ఉంటే ప్రపంచం మనల్ని గౌరవించదు” అని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని అంతర్గత విభేదాలను తొలగించుకుని, సమాజం ఐక్యంగా మారాలన్నారు. ప్రపంచంలో సామరస్యాన్ని వ్యాప్తి చేసే తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి భారత్ సిద్ధమైనప్పుడు, దేశ ఆర్థిక, భౌతిక పురోగతి దానంతట అదే సాధ్యమవుతుందని భగవత్ ఉద్ఘాటించారు.

# సంక్షేమానికి పెద్దపీట

ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యమంటూ రూ.3 లక్షల 24వేల 234 కోట్లతో పద్దును ప్రతిపాదించింది. ప్రజల భవిష్యత్తుకు భరోసానిచ్చేలా, వారి కలలు సాకారం చేసేలా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రగతి పథం వైపు పయనిస్తున్నట్లు తెలిపింది. మొత్తం రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర పద్దు ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం - రూ.47,267 కోట్లుగా వెల్లడించారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి రాష్ట్ర తలసరి ఆదాయం, అప్పులు, రెవెన్యూ వ్యయం తదితర వివరాలను వెల్లడించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగుజాడల్లో పాలనసాగిస్తున్నట్లుగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అటు శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

**బడ్జెట్ కేటాయింపులు ఇలా :**

రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్
మూలధన వ్యయం - రూ.47,267 కోట్లు
మొత్తం రెవెన్యూ ఆదాయం - రూ.2,41,263 కోట్లు
రాష్ట్ర పన్ను ఆదాయం - రూ.1,48,185 కోట్లు
పన్నేతర ఆదాయం - రూ.35,730 కోట్లు
గ్రాంట్లు - రూ.24,166 కోట్లు
మొత్తం మూలధన ఆదాయం - రూ.82,870 కోట్లు
బహిరంగ మార్కెట్ రుణాలు - రూ.73,383 కోట్లు
కేంద్ర ప్రభుత్వ రుణాలు - రూ.5,500 కోట్లు
ఇతర రుణాలు - రూ.వెయ్యి కోట్లు
లోన్లు, అడ్వాన్సులు - రూ.1,486 కోట్లు
రెవెన్యూ వ్యయం - రూ.2,34,406 కోట్లు
మూలధన వ్యయం - రూ.47,267 కోట్లు
రుణాలపై వడ్డీ చెల్లింపులు - రూ.21,304 కోట్లు
రాష్ట్ర తలసరి ఆదాయం - రూ.4,18,931

**శాఖల వారీగా కేటాయింపులు ఇలా :**

విద్యాశాఖ - రూ. 26,674 కోట్లు
వైద్యశాఖ - రూ. 13,679 కోట్లు
వ్యవసాయశాఖ - రూ.23,179 కోట్లు
విద్యుత్ శాఖ - రూ. 21,285 కోట్లు
పౌరసరఫరాలశాఖ - రూ.7,366 కోట్లు
పశుసంవర్ధకశాఖ - రూ.1,529 కోట్లు
కార్మికశాఖ - రూ.998 కోట్లు
మహిళ, శిశు సంక్షేమశాఖ - రూ. 3,143 కోట్లు
పర్యాటక రంగం - రూ.1,224 కోట్లు
ఎస్సీ సంక్షేమం -- రూ.11,784 కోట్లు
ఎస్టీ సంక్షేమం -- రూ.7,934 కోట్లు
బీసీ సంక్షేమం -- రూ.12,511 కోట్లు
మైనార్టీ సంక్షేమం -- రూ.3,769 కోట్లు

**శాఖల వారీగా కేటాయింపులు ఇలా :**

రాజీవ్ యువవికాసం - రూ.6 వేల కోట్లు
గృహ నిర్మాణం - రూ.7,430 కోట్లు
ఐటీ శాఖ -- రూ.875 కోట్లు
పరిశ్రమలు - రూ.3,490 కోట్లు
పంచాయతీరాజ్ - రూ.33,688 కోట్లు
నీటిపారుదల శాఖ -- రూ. 22,615 కోట్లు
రవాణా , ఆర్ అండ్ బీ - రూ.12,789 కోట్లు
న్యాయ శాఖ -- రూ.2,367 కోట్లు
పురపాలకశాఖ -- రూ.17,907 కోట్లు
హోంశాఖ -- రూ.11,907 కోట్లు
గోదావరి పుష్కరాలు - రూ.500 కోట్లు

రాష్ట్రబడ్జెట్?కు కేబినెట్ ఆమోదం : అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్?లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్? ప్రతిపాదనలకు కేబినెట్? ఆమోదం తెలిపింది. కాసేపట్లో రాష్ట్ర ఆదాయ వ్యయాల నివేదిక-బడ్జెట్?ను శాసనసభలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి విక్రమమార్క, శాసనమండలిలో ఉత్తమ్?కుమార్ రెడ్డి ప్రవేశపెడతారు.

# నర్సరీ నుంచి ఇంటర్ వరకూ ఒకే విద్యా విధానం!

-మొదటిపేజీ తరువాయి

తర్వాత విద్యావ్యవస్థలో మార్పులుంటాయని స్పష్టం చేశారు.

**మూసీ విషయంలో వెనుకాడేదే లేదు**

మూసీ పునరుజ్జీవం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులను మాత్రం ఆదుకుంటామని తెలిపారు. మూసీ అభివృద్ధికి అప్పులు ఇచ్చేందుకు ఏడీబీ సిద్ధంగా ఉందన్న ఆయన డీపీఆర్ సాంకేతిక నిపుణుల ద్వారానే తయారవుతోందని పేర్కొన్నారు. మూసీ డీపీఆర్ పూర్తయ్యాక నిధుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేస్తామన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని కాకపోతే నిధులను రాష్ట్రప్రయోజనాలకు ఉపయోగించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాలేదు కానీ రూ.44 వేల కోట్ల అప్పు చెల్లించినట్లు చెప్పారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని గ్యారంటీలు అమలు చేస్తున్నామని హరీశ్, కేటీఆర్, కేసీఆర్‌కు ఏం చెప్పినా చెవుటోడి ముందు శంకం ఊదినట్లేనని ఎద్దేవా చేశారు.

**ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధం**

అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారని, అందువల్లే ఆయన అసెంబ్లీకి రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిల్ట్ పాలసీ, టీడీఆర్ భూబదలాయింపుపై సవాలు విసిరానన్న సీఎం ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధమని కేటీఆర్, హరీశ్‌కు సవాల్ చేసినట్లు గుర్తుచేశారు. హిల్ట్ పాలసీ వల్ల రూ.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందనడం సరికాదని పేర్కొన్నారు.



తాము అధికారంలోకి వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అందులో నుంచి రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకే చెల్లించామన్నారు. తాము తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే వాడుకున్నట్లు చెప్పారు. ఫోన్‌ట్యాపింగ్ విషయంలో చట్ట ప్రకారమే ముందుకెళ్తామన్న ఆయన అలా వెళ్తేనే రేపు కోర్టులో కేసు నిలుస్తోందని వ్యాఖ్యానించారు.

**ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు దుష్ప్రచారం**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు 20 నెలలు అందు బాటులో లేరని ఆ కారణంగానే 20 నెలలు ఆలస్యమైంద న్నారు. ప్రభాకర్‌రావు అందుబాటులోకి వచ్చాక విచారణ వేగంగా కొనసాగుతోందని, సుప్రీంకోర్టులో ఫోన్‌ట్యాపింగ్ కేసు ఇంకా విచారణకే రాలేదని స్పష్టం చేశారు. చక్రధర్‌గౌడ్ కేసు కొట్టేస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ వసూళు గడిచిన రెండు నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయన్నారు.

**వారు ఇద్దరు ఒకటే అనడానికి ఇదే నిదర్శనం**

ఈ మధ్య పోలీసులపై కాల్పులు జరిగినా బీజేపీ నేతలు ఏ మాత్రం స్పందించలేదని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా బీజేపీ నేతలు మాట్లాడట్లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుందని, కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ఏ పదవి అయినా చేపట్టే వెసులుబాటు స్వేచ్ఛ ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆశించిన వారికి అభ్యంతరం చెప్పడం కానీ, అడ్డుకోవడం కాని జరగదని అన్నారు. జీవన్ రెడ్డి విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌లను అడగాలని తోసిపుచ్చారు. ఆపరేషన్ కగార్ అనేది కేంద్రం తీసుకున్న నిర్ణయమని, మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి రావాలని, భద్రత కల్పిస్తామని మాత్రమే విజ్ఞప్తి చేశానన్నారు.

# మలుపులు తిరుగుతున్న ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్ :** తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు ప్రస్తుతం ఒక కీలక మలుపు తిరిగింది. ఈ కేసు లోతుపాతులను వెలికి తీసేందుకు, అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో ఉన్న సంబంధాలను నిగ్గుతేల్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో మార్చి 14 శనివారం రాత్రి పెద్ద ఎత్తున డ్రగ్ పార్టీ జరుగుతోందని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఈగల్ టీం, స్థానిక పోలీసులు అర్ధరాత్రి సమయంలో మెరుపు దాడులు నిర్వహించారు.ఈ దాడుల సమయంలో అక్కడ పది మందికి పైగా వ్యక్తులు ఉన్నారు. పోలీసులను చూడగానే అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రోహిత్ రెడ్డి అనుచరులు, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మ పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారని, రోహిత్ రెడ్డి ప్రోద్బలంతోనే నమిత్ శర్మ గాలిలోకి కాల్పులు జరిపారని పోలీసులు ఈఎఖీలో పేర్కొన్నారు.ఈ కేసులో పోలీసులు మొత్తం 11 మందిపై ఔఆఖూ చట్టం, ఆర్మ్స్ యాక్ట్, ఃఔొ కింద కేసులు నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డిని ం1గా చేర్చారు. ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, నమిత్ శర్మలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నారు. సంఘటనా స్థలంలో ఉన్న వారందరికీ డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, రోహిత్ రెడ్డితో పాటు మరికొందరికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు చెప్పారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ కూడా ఈ పార్టీలో పాల్గొనడం రాజకీయంగా పెద్ద దుమారం రేపింది. రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం 9 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసింది. చెవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ నేతృత్వంలో పనిచేసే ఈ బృందం ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి. సుధీర్ బాబు పర్యవేక్షణలో ఉంటుంది. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుండి వచ్చాయి? దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో వీరికి



ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు జరుగుతోంది. పార్టీకి హాజరైన ఇతర రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల జాబితాను సిట్ సిద్ధం చేస్తోంది. లైసెన్స్ ఉన్న తుపాకీతో పోలీసులపైకి కాల్పులు జరపడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని విచారించనున్నారు. మూడు నెలల లోపు పూర్తి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం సిట్‌ను ఆదేశించింది.ఈ కేసు కేవలం ఒక క్రైమ్ కేసుగా కాకుండా రాజకీయంగా పెను మార్పులకు కారణమవుతోంది. బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డి అరెస్ట్ కావడంతో పార్టీ ఇరకాటంలో పడింది. మరోవైపు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పేరు రావడం కూటమి ప్రభుత్వానికి కూడా సవాలుగా మారింది. రెండు పార్టీలు ఇప్పటికే తమ నేతలకు నోటీసులు జారీ చేశాయి. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకంపై కఠినంగా ఉంటామని చెప్తున్న ప్రభుత్వానికి, ఈ కేసులో ప్రముఖులు పట్టుబడటం ఒక పరీక్షగా మారింది. సిట్ విచారణ పారదర్శకంగా జరిగితే మరిన్ని పెద్ద పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసు తెలంగాణ సమాజంలో డ్రగ్స్ సంస్కృతి ఎంతలా పాతుకుపోయిందో తెలియజేస్తోంది. చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడటం విచారకరం. సిట్ విచారణ ద్వారా డ్రగ్స్ సప్లై చైన్ తెంచగలిగితేనే, ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణపై చేస్తున్న పోరాటానికి అర్థం ఉంటుంది. రాబోయే మూడు నెలలు ఈ కేసులో అత్యంత కీలకం కానున్నాయి.

## కొత్తగా 2లక్షల మందికి పింఛన్లు, 5లక్షల బీమా

తెలంగాణ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి కేటాయింపులు పెంచడంతో పాటు పలు కొత్త పథకాలను శ్రీకారం చుడుతున్నట్లు డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు.

1. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం : తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కోసం సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా పథకం కింద భరోసా లభిస్తుంది. జూన్, 02, 2026 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకానికి బడ్జెట్?లో రూ.4 వేల కోట్లు కేటాయించారు.

2. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు : ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలతో ప్రత్యేక రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేసి అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయాలని భావిస్తున్నట్లు భట్టి బడ్జెట్? ప్రసంగంలో తెలిపారు. విద్యా కమిషన్ ప్రతిపాదనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ పబ్లిక్? స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి 12 వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. ఇందుకోసం బడ్జెట్?లో రూ.500 కోట్లు ప్రతిపాదించారు.

3. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరే ఇక్కడ అమలు చేయనున్నారు. బడ్జెట్ లో రూ.100 కోట్లు ప్రతిపాదించారు. వచ్చే విద్యా సంవత్సరం(2026--27) నుంచి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అందించనున్నారు. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగి జావ అందిస్తారు. దీనికోసం బడ్జెట్ లో రూ.800 కోట్లు కేటాయించారు.

4. ాుజ ట్రైనీలకు స్కాలర్ షిప్ : అడ్వాన్స్?డ్? ట్రైనింగ్ సెంటర్?లలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల రూ. 2 వేల స్కాలర్?షిప్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్కాలర్ షిప్ పథకానికి రూ.80 కోట్లను ప్రతిపాదించారు.

5. సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం : తెలంగాణలోని యువతకు వివిధ రంగాలలో స్కిల్? ట్రైనింగ్?ను ఇచ్చి వారికి ఉపాధి లభించేలా చేయనున్నారు. ఆయా దేశాలకు సంబంధించిన భాషా జ్ఞానంలో శిక్షణ, వీసా, విదేశీ ప్రయాణానికి కావలసిన రక్షణను కల్పిస్తామని తెలిపారు. విదేశాలలో ఆరోగ్య సేవలు, హస్పిటాలిటీ, నిర్మాణ పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తామన్నారు. ఈ పథకానికి రూ.1,056 కోట్లు ప్రతిపాదించారు.

6. క్యాష్?లెస్ ఆరోగ్య భద్రత పథకం : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అందించనున్నారు. ఈ పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రైవేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా ట్రీట్?మెంట్ పొందవచ్చు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందిస్తామని భట్టి తెలిపారు.

7. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా పథకం : ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భట్టి తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా వర్తించనుంది. 60 ఏళ్ల వరకు రూ. 10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2 కోట్ల అదనపు కవరేజి లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద 7. 57 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. దీనికోసం బడ్జెట్ లో రూ.1,056 కోట్లను ప్రతిపాదించారు.

## తెలంగాణ మరో శ్రీలంక కాబోతోంది

-మొదటిపేజీ తరువాయి

రైతులు అమాయకులనుకుంటున్నాడు ముఖ్యమంత్రి. కేవలం పద్దెనిమిది వేల కోట్ల రూపాయిలు మాత్రమే కేటాయిస్తావా..?, ఆరు వాయిదాలకు నాల్గు వాయిదాలు మాత్రమే ఇస్తుండు. మిగిలిన రెండు వాయిదాలు ఎగ్గొట్టే ప్లాన్ వేసిండు. ఈ ఒక్కసారిచ్చి పాతదివ్వక, వచ్చేదివ్వక ఖేల్ ఖతం, దుకాణం బంద్ అంటుడు ఈ ముఖ్యమంత్రి. రైతుకూలీలకు 12 వేలిస్తామని చెప్పి ఏమైందిప్పుడు..?

బీఆర్ఎస్ చేసిన 8 లక్షల కోట్లు అప్పు తీరుస్తామన్నవాడు.. ఇంకా అదే పాట పాడుతున్నాడు. ఆరు గ్యారంటీలు గాలికొదిలేసిండు ఈ సీఎం. ఇంకా లక్ష కోట్ల అప్పు చేస్తానని చెబుతుండు.. బీఆర్ఎస్ ఏం ఇచ్చిందని గాడ్డి గుడ్డు చూపిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా గాడ్డి గుడ్డు చూపించిండు' అని ధ్వజమెత్తారు.

## టీ కాంగ్రెస్‌లో బీసీ వర్సెస్ రెడ్డి

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి మాస్ లీడర్ అని ఆయనకు పీసీసీ ఇస్తే వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధిస్తామంటూ మాస్ ఎలివేషన్స్ ఇచ్చారు. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాల్సిన అధికార పార్టీలో, ఉన్నట్టుండి పీసీసీ మార్పు అంశం చర్చకు రావడం ఆసక్తిగా మారింది. దాంతో ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ పరిస్థితి ఏంటి? అంటూ బీసీ నేతలు కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు.మంత్రి కోమటిరెడ్డి కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో రెడ్డి వర్సెస్ బీసీ అనే వివాదానికి తెరలేపినట్లైంది. ప్రస్తుతం బీసీ వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీగా కొనసాగుతున్న తరుణంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జగ్గారెడ్డిని పీసీసీ చేయాలని అలా చేస్తే వంద సీట్లు సాధిస్తామని చిట్ చాట్ లో చెప్పడాన్ని బీసీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్ స్పందిస్తూ సొంత పార్టీపై కోమటిరెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరం అన్నారు. మంత్రి వ్యాఖ్యలు బీసీ నాయకత్వాన్ని కించపర్చడమేనని బీసీల పట్ల ఎందుకంత వివక్ష అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నిన్ను మంత్రిని చేస్తే కీలకమైన హోదాలో ఉండి ఇలాంటి పిచ్చి పిచ్చి స్టేట్‌మెంట్లు ఇస్తూ పార్టీ పరువు తీస్తున్నారని సొంత పార్టీ మద్దతుదారులే సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి ఇప్పుడు ఆయన కేబినెట్ లోనే ఉంటూ బీసీలను అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడుతున్నారుతాజా పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే పార్టీ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. సీఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేస్తూ అనవసర వివాదాల జోలికి వెళ్లవద్దని, పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు. అయినా మంత్రి కోమటిరెడ్డి మాత్రం జగ్గారెడ్డి విషయంలో చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే చిచ్చురాజేసినట్లైంది.తన వ్యాఖ్యలు పార్టీలో వివాదానికి దారి తీస్తుండటంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. మహేశ్ కుమార్ గౌడ్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని చెప్పారు. రంజాన్ వేడుకలకు జగ్గారెడ్డి ఏర్పాట్లు బాగున్నాయి. అందుకే పీసీసీ చీఫ్ అయితే బాగుంటుందని మాత్రమే అన్నారు. ఇప్పుడున్న పీసీసీని తొలగించాలనేది ఉద్దేశం కాదు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.



# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో వెయ్యి కోట్ల స్కాం

ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59% నుంచి గరిష్టంగా 4.96% ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5% దాటకుండా పక్కా ప్లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95% ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గం ఖమ్మంలో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి సీతక్క నియోజవర్గం ములుగులో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గం ఆంథోల్ లో 4.99 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నియోజకవర్గం వికారాబాద్ లో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న వాహనం ఐబూఖీ కంపెనీ పేరు మీదనే ఉంటుందని హరీశ్‌రావు తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే ఐబూఖీ సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు. దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడా రు. అభివృద్ధిని సమానంగా చూసిన బీఆర్ఎస్ ఎక్కడ? కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్న అక్కసుతో 26 నియోజకవర్గాలకు స్కూళ్లను ఆపేసిన మీరెక్కడ? అని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో జరిగిన ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు.



# ప్రతి సోమవారం మండల స్థాయి అధికారి గ్రీవెన్స్‌కు హాజరు కావాల్సిందే

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు .**

**జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్**

**పిజిఆర్ఎస్‌కు 43 అర్జీలురెవెన్యూ క్లినిక్‌కు 9 అర్జీలు**

**పాడేరు :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43, రెవెన్యూ క్లినిక్ కు 9 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ , ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డిఓ లోకేశ్వరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు చర్యలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల్ స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లాస్థాయిలో ప్రజా ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీ దారంతో మాట్లాడే సమస్యను పరిష్కారించి, గ్రీవెన్స్ హోటల్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అప్పుడు మాత్రమే పోర్టర్లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదేపదే అప్లికేషన్ రిపీట్ అవుతుందని తెలియజేశారు. గ్రీవెన్స్ లో అర్జితాలు ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి ఓవవనేబజీఎ.జీజూ.ఐనీల.తిని (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదిం చవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు కార్యాల యాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు కచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పిర్యాధుదా రునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలని, ఫిర్యాదును ముగించుటలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# కాటికి పంపేదాకా ఆగని కసాయి బంధం

**ప్రాణముండగానే శ్మశానానికి శ్రీధర్**

**రక్తం పంచుకున్నోళ్లే రాక్షసులైతే.. ఇక దిక్కెవరు??**

**భారమనుకున్నారో, బాధ్యత విస్మరించారో గానీ..**

**నిస్సహాయుడిని నిర్దాక్షిణ్యంగా వదిలేసిన వైనం!**

**జగిత్యాల :** కన్నవారు, ఉన్నవారు అండగా నిలవాల్సిన క్లిష్ట సమయంలో కసాయిగా మారిన వైనం జగిత్యాల పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. రక్తసంబంధం అని కూడా చూడకుండా, ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మృత్యువు ఒడిలోకి నెట్టేలా స్మశానవాటికలో వదిలివెళ్లిన అమానుష ఘటన స్థానికులను గ్భ్రాంతికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే, శ్రీధర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి సహకరించకో లేక సేవ చేసే ఓపిక లేకనో తెలియదు కానీ, అతని కుటుంబ సభ్యులు అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న శ్రీధర్‌ను బతికించుకోవాలని చూడాల్సింది పోయి, ఇక చనిపోతాడనే భావనతో అమానవీయంగా పట్టణంలోని స్మశానవాటికలో పడవేసి వెళ్ళిపోయారు. కనీసం మానవత్వం లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని అలా వదిలేయడం స్థానికంగా పెను దుమారం రేపింది. నిజానికి, ఆధునిక సమాజంలో మనుషుల మధ్య మమతలు ఎంతలా మంటగలుస్తున్నాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. ఆసుపత్రి బెడ్‌పై ఉండాల్సిన వ్యక్తిని, అనాథలా శ్మశానానికి చేర్చడం వెనుక ఉన్న కర్కశత్వం చూసి సభ్య సమాజం ముక్కున వేలేసుకుంటోంది. ప్రాణం పోయే వరకు కూడా కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడాల్సిన కన్నప్రేమ, ఇక్కడ కాలయముడిగా మారింది. కనీసం అంతిమ సంస్కారాల దాకైనా ఆగలేని ఈ తొందరపాటు, మానవ సంబంధాలలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతోంది. అయితే, స్మశానవాటికలో ఎవరో మూలుగుతున్న శబ్దాన్ని విన్న స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా, దీన స్థితిలో ఉన్న శ్రీధర్ కనిపించాడు. మానవత్వం ఇంకా చావలేదని నిరూపిస్తూ స్థానికులు తక్షణమే స్పందించి అతనికి నీళ్లు అందించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అతడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీధర్ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కన్నవారిని కడదాకా కాపాడాల్సిన కుటుంబ సభ్యులే ఇలాంటి క్రూరమైన చర్యకు పాల్పడటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాజం ఎటువైపు వెళ్తోందని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నా రు. ఈ దారుణంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ క్రూరత్వానికి పాల్పడిన వారిపై చట్టం తన పని తాను చేయాలని, అనాథలా మారిన శ్రీధర్‌కు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అక్రమ ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

**వాస్తవ నేస్తం,కోటగిరి(పోతంగాల్) :** పోతంగాల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామ సమీపంలో అక్రమ ఇసుక రవాణాపై ఎస్సై సునీల్ పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎస్సై, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, ఆ వాహనాలను వెంటనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్సై సునీల్, ఇద్దరు డ్రైవర్లతో పాటు ట్రాక్టర్ల యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.




## విద్యా రంగానికి మొండిచెయ్యి.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల పెదవివిరుపు

**ఎన్నికల ప్రణాళికలోని హామీలు బుట్టదాఖలు**

**వేతన సవరణ, కరువు భత్యాల ప్రస్తావనేదీ?**

**వార్షిక ఆర్థిక పద్దుపై ఆందోళన వ్యక్తం చేసిన ఉపాధ్యాయ సంఘాలు**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక ఆర్థిక పద్దులో విద్యా రంగానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక బకాయిలు, వేతన సవరణ, ఐదు విడతల కరువు భత్యాల గురించి వార్షిక పద్దులో కనీస ప్రస్తావన లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశాయి. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలల్లోనే వేతన సవరణ అమలు చేయాల్సి ఉండగా, ఇప్పటికే ముప్పై మూడు నెలల జాప్యం జరిగిందని విమర్శించాయి. ఉచిత పథకాలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం, అత్యంత కీలకమైన విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డాయి. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ. 1,056 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించినప్పటికీ, ఆ నిధులను పారదర్శకంగా, సక్రమంగా వినియోగించాలని కోరాయి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24,234 కోట్లతో ప్రవేశపెట్టిన వార్షిక పద్దులో, విద్య, మానవ వనరుల అభివృద్ధికి కేవలం రూ. 26,674 కోట్లు మాత్రమే కేటాయించడం నిరాశపరిచిందని పేర్కొన్నాయి. ఇది మొత్తం కేటాయింపుల్లో 8.2 శాతం మాత్రమేనని గుర్తుచేశాయి. ఎన్నికల ప్రణాళికలో విద్యా రంగానికి పదిహేను శాతం నిధులు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, వరుసగా మూడో పద్దులోనూ ఆ మాటను నిలబెట్టుకోలేకపోయిందని ఎద్దేవా చేశాయి. గత ఏడాది 7.58 శాతం నిధులు ఇవ్వగా, ఈసారి దాన్ని కేవలం 8.22 శాతానికే పరిమితం చేయడం ఏమాత్రం తగినది కాదని స్పష్టం చేశాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఉన్నత మాధ్యమిక స్థాయి (పన్నెండవ తరగతి) వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం హర్షణీయమే అయినప్పటికీ.. ఇందుకు అదనంగా కేటాయించిన రూ. 3,566 కోట్లు ఏమాత్రం సరిపోవని అభిప్రాయపడ్డాయి. నూతన తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల స్థాపన, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంపు వంటి కీలక అంశాలకు అదనపు నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, విద్యా రంగానికి అదనపు నిధులు మంజూరు చేయడంతో పాటు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. నరసింహస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



## ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పుమోపారు

రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అని తెలంగాణ జాగృతి నేత కవిత అన్నారు. రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. 56 శాతం జనాభా ఉన్న బీసీలకు ఇచ్చింది 4 శాతం నిధులే. తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని అన్నారు. ఎంబీసీ మినిస్ట్రీ, ఎంబీసీలో వెనుబడిన కులాలకు కార్పొరేషన్లు అన్నారు. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ రాష్ట్రంలో గిరిజన మంత్రి లేని మొదటి ప్రభుత్వం ఇది. మైనార్టీ మంత్రి కూడా మొన్నటి వరకు లేడు. దీనిపై మేము పోరాటం చేస్తే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారు. కచ్చితంగా లంబాడా మినిస్టర్ ను కూడా నియమించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇక 22 లక్షల 50 వేల ఇళ్లు కడతామని చెప్పి వాటికి 5,500 కోట్లు మాత్రమే కేటాయించారు. గతే బడ్జెట్ లో 12 వేల కోట్లు కేటాయిస్తే ఈ సారి 7 వేల కోట్లు తగ్గించారు. అందుకే ఇది విజన్ బడ్జెట్ కాదు. రీ విజన్ బడ్జెట్ మాత్రమే అంటున్నా. 20 వేల కోట్లు అప్పులు రీస్ట్రక్చర్ చేసుకునేలా చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్ దాదాపు 20 వేల కోట్లు అని గత బడ్జెట్ లో చెప్పారు. వచ్చింది మాత్రం 11 వేల 120 కోట్లు మాత్రమేనని అన్నారు.

## మీ ప్రత్యేకతను చూపినప్పుడే విజయం

**ప్రజాప్రయోజనమే లక్ష్యంగా పని చేయాలి**

**గ్రూప్- 1కు ఎంపికైన వారికి హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్ :** 'ఎంతో కష్టపడి చదువుకుని గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు శాఖల్లో అధికారులుగా మీరు విధులు నిర్వహించనున్నారు. మీనే మీ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలి. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మీ చర్యలుండాలి. మీ ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలి.. ప్రజాప్రయోజనమే లక్ష్యంగా ఉండాలి. ప్రజలకు పూర్తి అవగాహన ఉంటే.. పరిపాలన సులభమౌతుంది. వారి మద్ధతు కూడా సంపూర్ణంగా అందుతుంది. చరిత్రను ఫాలో అయి.. మీ విభాగాల్లో ఎవరికి వారు కొత్త చరిత్రను సృష్టించాలి ' అని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. గ్రూప్ -1 కేడర్‌కు ఎంపికైన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంల భాగంగా శుక్రవారం డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. హైడ్రా కార్యకలాపాలను వివరించారు. ఆదిలో హైడ్రా ఎదుర్కొన్న సవాళ్లను.. వాటిని అధిగమించిన తీరును తెలిపారు. హైడ్రా అంటే ప్రజల్లో పూర్తిగా అవగాహన రావడంతో తాము చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్ధతు లభిస్తోందన్నారు. సామాజిక మాధ్యమాల్లో గమనిస్తే.. హైడ్రా అంటే ఆదిలో దాదాపు 70 శాతం నెగిటివిటీ కనిపించేది.. ఇప్పుడా శాతం రివర్స్ అయ్యిందన్నారు. 85 శాతం మంది హైడ్రా పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఇదంతా ప్రజలకు అర్థమయ్యేలా మన కార్యకలాపాలు సాగించడం.. గ్రౌండ్‌మీద ఫలితాలు చూపించడంతో సాధ్యమైందన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com